# డ్రింక్ - ట్రింగ్

మొన్న ఉదయాన్నే వాకింగ్‌కని బయల్దేరా... చలి... విపరీతంగా పొగమంచు... మామూలుగా హైవే మీదకి వెళ్లే నేను ఆ రోజు ఊళ్లోకి వెళ్లేదారి పట్టాను... కాస్త చలి తక్కువగా ఉంటుందని....

ఓ పదడుగులు వేశానో లేదో పోలీసువాళ్ల రక్షక్ వ్యాను మూసేసిన బార్ అండ్ రెస్టారెంటు ముందు కనిపించింది. ముగ్గురు పోలీసువాళ్లు అక్కడ పడివున్న ఓ వ్యక్తిని కుదుపుతూ లేపుతున్నారు...

కుతుహలం చాలా చెడ్డది కదా! కొండకచో మంచిదీ కావచ్చు... నేనూ వెళ్లి తొంగి చూశాను... స్ట్రీట్‌లైట్ మసక వెల్తురూ... పోలీసువాళ్ల వ్యాను లైటు వెలుతుర్లో కింద మట్టిలో దొర్లుతున్న వ్యక్తిని చూశాను...

'ఆఁ వూఁ' అంటున్నాడు. ఒంటిమీద బొత్తిగా స్పృహ లేదు... బట్టలు దుమ్ము కొట్టుకునున్నాయి... కాళ్లకున్న హవాయి చెప్పులు అటోటీ యిటోటీ పడివున్నాయి...

ఓ కానిస్టేబుల్ అతన్ని బలవంతంగా లేపి కూచోపెట్టాడు. మసకవెల్తుర్లో అతని (ఆ తాగుబోతు) ముఖాన్ని చూశాను.

ఒకప్పటి స్టేట్ హాకీ ప్లేయరు.. ఓ ప్రభుత్వ శాఖలో ఉన్నతోద్యోగి అయిన మిత్రుడు..

'సార్ నాకితను తెలుసు' అని పోలీసువారితో అన్నాను.. 'ఎవరు ఏమీ' అని ప్రశ్నించిన తర్వాత... వాళ్లు కూడా ఆశ్చర్యపోయి (ఎందుకంటే అతను పనిచేస్తున్నదీ వారి అనుబంధ శాఖనే) "సరే ఆటో పంపిస్తాం... యింటికి చేర్చండి" అని వెళ్లి ఆటో పంపించారు.

సరే ఆటో వ్యక్తికి అడ్రసు చెప్పి అతన్ని ఆటోలోకి మార్చాను... అతనిల్లు చేరేవుంటాడు.

తలకి హెల్మెట్లూ... కారు సీటుకు బెల్టులూ అని మ్యాండేట్లు జారీచేసే ప్రభుత్వం (వాళ్లకు ప్రాణహాని అని నమ్మబలుకుతూ) ఈ మద్యంమీద కంట్రోలు అన్నది లేకుండా ఎందుకు అమ్ముతోంది.

ప్రభుత్వం అమ్మకపోతే మద్యం దొరక్క ప్రజలు తాగడం మానేస్తారా? అన్న వెర్రి ప్రశ్న నేనే ఒకప్పుడు వేశాను. మానేస్తారు... నూటికి డెబ్భై ఎనభైమంది ఖచ్చితంగా మానేస్తారు.

దొంగ సారా ధర భరించలేక... పోలీసులకు భయపడీ.. ఏదేమైనా..ఖచ్చితంగా సారా ప్రియులు కట్టడికి లోనౌతారు... సరే అమెరికాలాంటి దేశాల్లోనే మద్య నిషేధం మట్టి కరిచింది. గాంధీ స్వంత రాష్ట్రం సౌరాష్ట్రంలో గల్లీగల్లీకి మందు లభ్యమవుతోంది. అంతెందుకు గాంధీ కొడుకే పచ్చితాగుబోతై గాంధీని పబ్లిక్కున పచ్చిపచ్చిగా తిట్టిన చరిత్ర మన ముందుకు రాదు...

రాజకీయ నాయకుల ప్రమేయాన్ని నిలువరిస్తే మద్యం ఖచ్చితంగా అదుపులోకి వచ్చే సరుకే.

మా జిల్లా రాజకీయాలలో మద్యం విక్రయదారులే పెద్దపీఠాలు ఎక్కారు. సరేసరే మద్యం, సిగరెట్లూ, మాదకద్రవ్యాలూ, రాజకీయాలూ చెట్టాపట్టాలు వేసుకుని నడుస్తున్నవే.

* * *

మా ఇంటి టర్నింగ్ దాటగానే ఓ పదిహేనిరవై గుడిసెలుంటాయి. అందులో ఆవాసముండే వాళ్లందరూ దాదాపు ఇళ్ల కట్టడాల్లో పనిచేసే కూలీలే. అన్ని గుడిసెలూ ప్లాస్టిక్ షీట్లూ అట్టల్తో హడావుడిగా నిర్మించబడ్డవే. అందరూ (దాదాపు) సాయంకాలం కాగానే, ఆ గుడిసెల ఎదురుగా యింకో పెద్ద గుడిసె వుంది – అక్కడ గుమికూడతారు. ఆ పెద్ద గుడిసె ఓ....... పెంట (పాక అనాలి కాబోలు) అక్కడ దొరికే కల్లు ఇటువేపు పూర్తిగా దుర్లభం అనుకోండి) సాయంత్రం చీకటి పడుతుండగా (ఈ కార్మికుల జీవితాల్లో కూడా) ఓ జీపు వచ్చి ఆగుతుంది. అందులోంచి ఓ పెద్ద డ్రమ్ము, ఓ సిమెంటు బస్తాడు .....కలూ నలుగురు వ్యక్తులూ దిగుతారు.

ఓ పెద్ద డ్రమ్మునిండా నీళ్లుపోసి సిమెంటు సంచీలో తెచ్చిన తెల్లటి పౌడరు అందులో కలుపుతారు. ఓ రకమైన వాసనతో నురగ నిండిన తెల్లటి ద్రావకం తయారవుతుంది.

కల్లు రెడీ..

నకిలీ మనుషులే ఉన్న ఈ రోజులో నకిలీ కల్లెంత...! అది తాగిన వాళ్లకి నోటి ఆ రుచిపోడానికి ఎదురుగా ఓ మిర్చీ బజ్జీ బండి... అది నడిపే వ్యక్తి ఓ అట్టడుగు వర్గానికి చెందిన మహిళే. భర్త చనిపోగా బతుకు నడుపుకోవడానికి వయసులో ఉన్న కూతుర్ని చదివించుకోవడానికీ ఆమె ఎంచుకున్న మార్గమది..

ఇక్కడో ఇంగ్లీషు సామెత చెబుతాను... ఇంత అక్కసూ ఎవరిమీద వెళ్లబోసుకోను మరి...

అవధరించండి.

One must get married because he can'nt blame the government

ప్రతి వ్యక్తి విధిగా పెళ్లి చేసుకోవాలి. ఎందుకంటే మనం అయినదానికీ కానిదానికీ ప్రభుత్వాన్ని నిందించలేం కదా!"

అంటే పైన నా కంఠశోషంతా ప్రభుత్వ నిందతో పోదు... ఇంట్లోవాళ్ల మీద యుద్ధాన్ని ప్రకటించాలి.

* * *

ఇంత చేసీ ఇంత రాసీ నువ్వేం ఉద్ధరించావ్ వెధవా! అని నన్నడిడితే...?!

నేనూ తాగుతానండీ – మద్యనిషేధం ఉన్నరోజుల్లోనూ... రాజకీయ నాయకుల పుణ్యమాని ప్రతిరోజూ తాగాను...

నేను తాగుతాను కాబట్టే తాగుడు అవలక్షణాల్ని లక్షణంగా తెలుపగలను... ఇక్కడో సంగచ్చెప్పాలండీ... మద్యనిషేధం మీద అతివలు పెను యుద్ధాన్ని ప్రకటించిన సందర్భంలో శ్రీశ్రీశ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు వాళ్లకు తన మద్దతను గట్టిగా ప్రకటించారు. అయితే ఇదే మాన్యశ్రీ గోపాలకృష్ణయ్యగారు ప్రకాశం పంతులు హయాంలో మద్యనిషేధం ప్రకటిస్తే దానికి వ్యతిరేకంగా ఓటు వేశారు.

సరే... నా చిన్న జీవితంలోని ఓ చిన్నకథ ఇక్కడ అవసరం...

నా బాల్యమిత్రుడు రాజగోపాలరెడ్డి బ్యాంకు మ్యానేజరు... వాడి కూతురు వినీత ఇంజనీరింగ్ చదువుతోంది. ఓ రోజు నీమధ్య 'మామా! మామా! నీ సంతకమున్న ఓ ఇరవై రూపాయల నోటుంది నాన్న దగ్గర అంది.

'ఇరవై రూపాయల నోటుమీద నా సంతకమేమిటి నేనేమైనా రిజర్వు బ్యాంకు గవర్నర్నా'? అన్నాను.

మా రాజుగాడు పెద్దగా నవ్వి... (వాడు కూడా నన్ను మామూ అని పిలుస్తాడు)

"దీని వెనక ఓ ఇరవై సంవత్సరాల హిస్టరీ ఉంది మామూ' అన్నాడు...

'చెప్పు చెప్పు..." అని అందరూ అంటే చెప్పుకొచ్చాడు వాడు..

ఓ రోజున మధ్యరాత్రి పన్నెండున్నర ఒంటిగంట ప్రాంతంలో వాడు (మా రాజు గాడు) హైదరాబాద్ నుంచి వస్తూ సైకిల్ రిక్షా ఎక్కి వస్తున్నాడు. దారిలో హంద్రీ బ్రిడ్జిమీద ఇద్దరు తాగుబోతులు వంకరటింకరగా సైకిళ్లు తొక్కుతూ వెళ్తున్నారు.

'తప్పతాగి వెళ్తున్నారు వెధవలు ఏ లారీ కింద పడతారో' అని తిట్టుకుంటూ ఆ ఇద్దరు తాగుబోతుల్నీ గద్దించడానికి రిక్షా ఆపించాడు. ఆ ఇద్దరు తాగుబోతుల్లో నేనూ ఒకణ్ణి.

ఇక మా రాజుగాడు ఊరుకోలేక 'మామూ! సైకిలు ఆ పక్కన హోటల్ సందులో

పెట్టి రిక్షా ఎక్కు.. ఇట్లాంటి పరిస్థితుల్లో నిన్ను సైకిలు తొక్కనివ్వను' అని గద్దించాడు (ట).

మనం అసలే 'హై'లో ఉన్నాం కదా! "హుఁ రిక్షానా? నేనెక్కనంటే ఎక్కను. వాడు లాగుతోంటే మనం కూచోడమా?! పెత్తందారీ బూర్జువా... మార్క్సు ఏంగిల్సు... లెనినూ.." అని గొడవ (ట).

"సరే నేను తొక్కుతానురా" అని మా రాజుగాడు (చూడండి ఓ ప్రముఖ బ్యాంకు మ్యానేజరు నాకు స్నేహతుడైన నేరానికి) రిక్షా వ్యక్తినీ నన్నూ ఇద్దర్నీ కూచోబెట్టుకుని ఇంటివరకూ లాక్కొచ్చాడు.

దిగింతర్వాతయినా తిన్నగా ఉండొచ్చుగా...జేబులోంచి విలాసంగా ఓ ఇరవై నోటు తీసి వాడికి (మా రాజుగాడికి) ఇచ్చానట...

"సర్వే ఇవ్వు కానీ దీనిమీద నీ ఆటోగ్రాపోటి పారేయ్... ఈ అనెక్‌డోట్ నేను ఎక్కడైనా చెప్పుకోడానికుంటుంది" అని ఆ నోటు మీద నా సంతకం తీసుకున్నాట్ట అదండీ..

* * *

జీవితమే వ్యసనంగా పరిణమించిన ఈ రోజుల్లో తాగుడు.. ముఖ్యంగా తాగుడు.. దీని కోరల్లో చిక్కుకున్న వాళ్లు ఎంతమందో.... వాళ్లల్లో ఒక్క శాతమైనా ఈ వ్యాసం చదువుతారా! ●